క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో చక్రస్నానాలు



సువర్ణముఖి నదిలో లక్ష్మీనృసింహస్వామికి చక్రస్నానాలు చేస్తున్న అర్చకులు

సీతానగరం: మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న లక్ష్మీన్నసింహస్వామి చక్రస్నాన మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయ ప్రధాన అర్చకులు పీసపాటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త సీహెచ్ గోపాలకృష్ణ దంపతులు స్వామివారికి 108 రకాల నైవేద్యాలను సమర్పించారు. అనంతరం స్వామివారిని సువర్ణముఖి నదీ తీరానికి తీసుకువెళ్లి కొబ్బరినీరు, పంచామృతాలు, నదీ జలాలలో చక్రస్నానాలు చేశారు. పూజా కార్యక్రమాల్లో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులంతా అందుబాటులో ఉండాలి



ఎంఈఓ సామల సింహాచలం

పార్వతీపురంటౌన్: సార్వత్రిక ఎన్నికల విధులకు సంబంధించిన రెండో విడత శిక్షణా తరగతుల నిమిత్తం ఉపాధ్యాయులందరూ అందుబాటులో ఉండాలని ఎంఈఓ సామల సింహాచలం ఆదేశించారు. ఈ మేరకు బుధవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికలకు సంబంధించి పీఓ, ఏపీఓలకు మొదటి విడత శిక్షణ కార్యక్రమం పూర్తయ్యాయని, అదేవిధంగా రెండో విడత శిక్షణ కార్యక్రమం త్వరలోనే ఉంటుందన్నారు. అందువలన సెలవుల్లో ఉపాధ్యాయులందరూ అందుబాటులో ఉండాలన్నారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రాలుగా ఎంపికైన పాఠశాలల హెచ్ఎంలు పాఠశాల తాళాలను ఆ గ్రామంలోని బీఎల్ఓలకు అందచేయాలన్నారు. ఎన్నికల సిబ్బందికి పాఠశాలలో కనీస సౌకర్యాలైన తాగునీరు, ఫర్నీచర్, విద్యుత్, ఫ్యాన్ వంటివి ఏర్పాటు చేసి సమాచారం అందజేయాలన్నారు.

541 బోర్లకు మరమ్మతులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని 541 తాగు నీటి బోర్లకు మరమ్మతు పనులు చేపట్టినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారించేందుకు మార్చి నెలలో ప్రారంభించిన క్రాష్ ప్రోగ్రాం ద్వారా మండలంలోని అన్ని తాగునీటి బోర్లను మరమ్మతు చేపట్టడం జరిగిందన్నారు. వాటితో పాటు రక్షిత మంచి నీటి పథకాల ద్వారా నీటి సరఫరాలో తలెత్తిన సమస్యలను కూడా పరిష్కరించి ప్రజలకు నీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలియజేశారు.

సాలూరులో జన సునామీ..

- అట్టహాసంగా రాజన్నదొర రెండో సెట్ నామినేషన్
- వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులు
- జై జగన్.. జై రాజన్నదొర నినాదాలతో మార్మోగిన పట్టణం



ఆర్ఓ విష్ణుచరణ్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న పీడిక రాజన్నదొర



ర్యాలీగా వస్తున్న వేలాది మంది కార్యకర్తలు, అభిమానులు



శ్యామలాంబ ఆలయంలో పూజలు చేస్తున్న రాజన్నదొర



ర్యాలీ ప్రారంభంలో ప్రజలకు అభివాదం చేస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

సాలూరు: సాలూరు పట్టణం జన సంద్రంగా మారింది. తన అభిమాన నాయకుడు పీడిక రాజన్నదొరకు మద్దతుగా తరలివచ్చిన వేలాది మంది కార్యకర్తలు, అభిమానులతో జన సునామీని తలపించింది. సాలూరు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పీడిక రాజన్నదొర బుధవారం రెండవ సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఉదయం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకుని నామినేషన్ పత్రాలను ఆర్ఓ, ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్‌కు అందజేశారు. అనంతరం పట్టణంలోని శ్యామలాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అక్కడ నుంచి వెలమపేట, శివాజీ జంక్షన్, వైఎస్సార్ కూడలి, మెయిన్‌రోడ్డు, చినబజారు, డీలక్స్ సెంటర్, కోట జంక్షన్, పెదకోమటిపేట, డబ్బివీధి, మాడిడిపల్లి జంక్షన్, తదితర ప్రాంతాల మీదుగా భారీ ర్యాలీ చేపట్టారు. తమ అభిమాన నాయకుడు రాజన్నదొరకు మద్దతుగా వేలాదిగా పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు తరలివచ్చారు. దారిపొడవునా రాజన్నదొరకు పూలాభిషేకం చేశారు. మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. జై జగన్, జై రాజన్నదొర నినాదలతో సాలూరు పట్టణం మార్మోగింది. ఉర్రూతలూగించే పార్టీ పాటలకు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ ముందుకు కదిలారు. తనకు మద్దతుగా తరలివచ్చిన కార్యకర్తలకు రాజన్నదొర అభివాదం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను ఆశీర్వదించాలని, సంక్షేమ పాలన అందించిన జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. సాలూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి బుధవారం మొత్తం నాలుగు నామినేషన్లు వచ్చాయి. వైఎస్సార్‌సీపీ తరఫున పీడిక రాజన్నదొర, పీడిక సుదర్శనరావు, టీడీపీ తరఫున జి.సంధ్యారాణి, కాంగ్రెస్ తరఫున మువ్వల పుష్పారావు నామినేషన్లు వేశారు.



అభిమానులతో కిక్కిరిసిన సాలూరు వీధులు

ప్రజలకు మంచి చేయడమే నేను నమ్మిన సిద్ధాతం

- నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటా..
- డిప్యూటీ సీఎం రాజన్నదొర

సాలూరు: ప్రజలకు మంచి చేయడమే నేను నమ్మిన సిద్ధాంతమని డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి పీడిక రాజన్నదొర అన్నారు. పట్టణంలో బుధవారం ఎన్నికల ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలు తనపై చూపిస్తున్న ప్రేమాభిమానాలకు జీవితాంతం రుణపడి ఉంటానని అన్నారు. గత ఐదేళ్లలో నియోజకవర్గంలో వందపడకల ఆస్పత్రి, టిడ్కో ఇళ్లు, రోడ్లు, వంతెనలు, డ్రైనేజీలు నిర్మాణంతో పాటు అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తే.. 2019 ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేశారని గుర్తుచేశారు. ఇప్పుడు ఎన్నికలు సమీపించడంతో 'సూపర్ సిక్స్' పేరుతో ప్రజలను మరోసారి మోసం చేసేందుకు చంద్రబాబు వస్తున్నారని, ఆయన మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. టీడీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్సీగా ఉన్న సంధ్యారాణి నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి శూన్యమని అన్నారు. నేడు అబద్ధపు హామీలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రాజన్నదొర ఎప్పుడూ మీ వాడేనని, ప్రజలందరికి ఎప్పుడూ అండగా ఉంటానని పునరుద్ఘాటించారు. ప్రజలకు మంచి చేసింది జగన్‌మోహన్‌రెడ్డి కాగా, మోసం చేసింది చంద్రబాబని అన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఈ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని, జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు.

మళ్లీ జగనన్నే సీఎం

- ఎన్ని కూటములు వచ్చినా వైఎస్సార్‌సీపీదే గెలుపు
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే జోగారావు, ఎంపీ అభ్యర్థి తనూజారాణి



పట్టణంలో 16వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జోగారావు, ఎంపీ అభ్యర్థి డాక్టర్ తనూజారాణి

పార్వతీపురంటౌన్: ఎన్ని పార్టీలు జతకట్టి వచ్చినా సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యమని, జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పట్టణంలోని 16వ వార్డులో వైఎస్సార్‌సీపీ అరకు పార్లమెంట్(ఎంపీ) అభ్యర్థి డాక్టర్ గుమ్మ తనూజారాణితో కలిసి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు అందజేసి ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలను మోసగించేందుకే చంద్రబాబు కూటమి కట్టారన్నారు. ఎంపీగా డాక్టర్ గుమ్మ తనూజారాణిని, ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత పురోభివృద్ధిలోకి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు. మే నెల 13న జరగనున్న ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఓటర్లను అభ్యర్థించారు. స్థానిక సమస్యలను పరిష్కరించామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు, ఇళ్లు, ఇళ్ల స్థలాలు అందించామన్నారు. గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. ఐదేళ్ల పాలనలో మీకు మంచి జరిగిందనుకుంటేనే ఓటు వేయండని ధైర్యంగా అడుగుతున్న దమ్మున్న నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. జగనన్న మరోసారి సీఎం కాగానే ప్రజల అవసరాలను నాయకులు, కార్యకర్తల సహకారంతో తీర్చుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపలిల బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, వార్డు కౌన్సిలర్ గొర్లి మాధవరావు, స్థానిక కౌన్సిలర్లు ఎస్.లక్ష్మీ పార్వతీ, చీకటి అనురాధ, సువ్వాడ లవణ్య, సందీప్, పలువురు కౌన్సిలర్లు, కోఆప్సన్ సభ్యులు, పార్టీ నాయకులు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, స్టేట్ డైరెక్టర్లు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఫైలేరియా సర్వేకు ప్రజలు సహకరించాలి



రక్తపూతలు సేకరిస్తున్న హెల్త్ సూపర్‌వైజరు శర్మ, సిబ్బంది

సీతానగరం: ఫైలేరియా నివారణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పీహెచ్‌సీ వైద్యులు బి.పావని చెప్పారు. మండలంలోని పణుకుపేట, రంగంపేట, బల్లకృష్ణాపురం, బగ్గందొరవలస, బక్కుపేట గ్రామాల్లో మంగళవారం రాత్రి సుమారు 125 మంది నుంచి రక్తనమూనాలు సేకరించినట్లు చెప్పారు. సేకరించిన శాంపిల్స్‌ను ల్యాబ్‌లో పరీక్షించి వ్యాధి నిర్ధారణ అయితే తగిన చికిత్స అందించడం జరుగుతుందన్నారు. శాంపిల్ సేకరణకు వస్తున్న సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. ఫైలేరియా నివారణపై వైద్యారోగ్యశాఖ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో విజయనగరం డీఎంహెచ్ఓ కార్యాలయం హెచ్ఎస్ లోకనాథం, సీహెచ్ఓ ఎస్వీ రమణ, హెల్త్ సూపర్‌వైజరు శర్మ, సిబ్బంది హరికృష్ణ, చంద్రినాయుడు, చిన్నారాయణ, శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పీ బుజ్జి, స్వర్ణ, లక్ష్మీ, సరస్వతి పాల్గొన్నారు.

పల్లె ముంగిటకే ప్రభుత్వ సేవలు



పాలకొండ నియోజకవర్గంలోని వాటపాగు సచివాలయం

పాలకొండ రూరల్/ కురుపాం: జాతిపిత మహాత్మా గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం జగనన్న పాలనలో నిజమైంది. దీనికి గ్రామ సచివాలయే వ్యవస్థ నిదర్శనం. ఈ వ్యవస్థ ద్వారా లక్షలాది మంది యువత, నిరుద్యోగులకు సర్కారు కొలువు లభించింది. దీని ద్వారా అధికార యంత్రాంగాన్ని పల్లె వాకిటకి చేర్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కింది. గతంలో ప్రజలకు ఏ పని కావాలన్నా మండల కేంద్రానికి పరుగులు పెట్టాల్సి వచ్చేది. జగనన్న పాలనలో పరిస్థితులు మారాయి. సంక్షేమ లబ్ధి నుంచి ఏ సమస్య తీరాలన్నా సచివాలయ వ్యవస్థ ద్వారానే గ్రామాల్లోనే పరిష్కారానికి నోచుకుంటున్నాయి.పట్టాదారు పాసు పుస్తకాలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డులు, రిజిస్ట్రేషన్లు, వివాహ ధ్రువపత్రాలు, విద్యుత్ మీటర్లు, లైసెన్సులు, పింఛన్ల మంజూరు ఇలా 526 సేవలకు సంబంధించి ఏ పథకం కావాలన్నా వ్యయప్రయాసలు పడాల్సిన అవసరం లేదు. పంచాయతీలకు అనుసంధానంగా ఏర్పాటు చేసిన సచివాలయా ద్వారా సేవలన్నీ ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చారు.

సచివాలయ వ్యవస్థ అద్భుతం



క్షేత్ర స్థాయిలో జగన్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ ప్రజలకు ఎంతో ప్రయోజనకరం. ఎటువంటి కష్టం లేకుండా సచివాలయాల వద్ద పనులు జరుగుతున్నాయి. అందిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, ఎటువంటి అవగాహన లేకున్నా సచివాలయం వద్దకు వెళితే చాలు అవసరమైన పనులు చేసి పెడుతున్నారు.

– మిడితాన సూర్యనారాయణ, ఎన్కే రాజపురం, పాలకొండ పట్టణం

సేవలన్నీ ఒక్క చోటే...



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తీసుకొచ్చిన గ్రామ సచివాలయం, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ఉన్న ఊర్లోనే ప్రభుత్వ సేవలన్నీ అందుతున్నాయి. కుల ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకున్న కొన్ని గంటల్లోనే ఇంటి వద్దకే తీసుకొచ్చి ఇచ్చారు. ఇది కదా గ్రామ స్వరాజ్యం అంటే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగానే ఉంటాం.

– రెడ్డి రాజేశ్వరి, గుమ్మలక్ష్మీపురం

నామినేషన్ కోలాహలం



మక్కువ: రాజన్న దొర నామినేషన్ కార్యక్రమానికి మక్కువ నుంచి బయలుదేరి వెళ్తున్న అభిమానులు



పార్వతీపురం టౌన్: ర్యాలీగా వెళ్తున్న పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి జోగారావు, అరకు ఎంపీ అభ్యర్థి తనూజారాణి



పార్వతీపురం టౌన్: పార్టీ జెండాలతో మహిళా కార్యకర్తలు



మక్కువ: కార్యకర్తలతో కలిసి రాజన్నదొర నామినేషన్ కార్యక్రమానికి వెళ్తున్న వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రంగునాయుడు



పార్వతీపురం టౌన్: కోలాట బృందం ప్రదర్శన

పార్వతీపురంటౌన్: వైఎస్సార్‌సీపీ నుంచి పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా అలజంగి జోగారావు, ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ గుమ్మ తనూజారాణి బుధవారం నామినేషన్లు దాఖలు చేశారు. వేలాది మంది అభిమానులు, కార్యకర్తలతో ర్యాలీగా వెళ్లి నామినేషన్లు వేశారు. దారిపొడవునా జై జగన్, జై జోగారావు, జై తనూజారాణి అంటూ నినాదాలు చేశారు. కార్యకర్తల కేరింతలు, కోలాహలం మధ్య నామినేషన్ కార్యక్రమం అట్టహాసంగా సాగింది.



సీతానగరం: అప్పయ్యపేట నుంచి ఆటోలో తరలివెళ్తున్న వైఎస్సార్‌సీపీ అభిమానులు



సీతానగరం: కాశీపేట నుంచి ద్విచక్రవానాలతో పయనమైన కార్యకర్తలు

సీతానగరం: రాష్ట్రంలో సంక్షేమ పాలన అందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజలంతా ఏకమయ్యారు. వైఎస్సార్‌సీపీ తరఫున పార్వతీపురం ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న అలజంగి జోగారావు, అరకు పార్లమెంట్ స్థానం బరిలో ఉన్న డాక్టర్ తనూజారాణి బుధవారం నామినేషన్ పత్రాలను సమర్పించారు. వారికి మద్దతుగా పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజాప్రతినిధులు ర్యాలీగా పార్వతీపురం తరలివెళ్లారు. దారిపొడవునా జై జగన్ నినాదాలు చేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతూ ప్రచారం చేశారు.

మక్కువ: వైఎస్సార్‌సీపీ సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి పీడిక రాజన్నదొర నామినేషన్ కార్యక్రమానికి మండలం నుంచి వేలాదిమంది పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సాలూరు తరలివెళ్లారు. జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు, డీసీసీబీ డైరెక్టర్ మావుడి తిరుపతినాయుడు సారథ్యంలో ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో తరలివెళ్లారు. జై జగన్ నినాదాలతో మక్కువ పులకించింది.



సీతానగరం: బుద్ధిపేట నుంచి బయలుదేరిన నాయకులు



సీతానగరం: దయానిధిపురం నుంచి పయనమైన కార్యకర్తలు



సీతానగరం: నామినేషన్ కార్యక్రమానికి తరలివెళ్తున్న ఎస్ఎస్‌పురం గ్రామస్తులు

నేడు ఎమ్మెల్యే ప్రచారం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కొండవాడ, లుంబేసు, పి.ఆమిటి పంచాయతీల్లోని గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి పాముల పుష్పశ్రీవాణి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని ఎంపీపీ కుంబురుక దీనమయ్య తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులంతా హాజరవ్వాలని పిలుపునిచ్చారు.